

కామందుగారు!

*జీవితంలో ఒడుదుడుకులు అధికంగా అనుభవించేవారికి వేదాంతమే శరణ్యం. వెర్రి ముదిరినా, వేదాంతం ముదిరినా అసలుకే మోసం. అయినా వేదాంతం అంటూ లేకపోతే కామందులవారి ఘనత లోకానికి ఎలా తెలుస్తుంది ?*

కామందులవారు చాలా గొప్పవారు.

ఆయన గొప్పతనాన్ని గురించి వెయ్యిన్నీ నూటపదహార్లు పుచ్చుకొని పద్మినీ వంటి ఫస్టు క్లాస్ కావ్యాన్ని కృతిఇచ్చిన మధుర కవిరత్న కావ్యాలంకార భూషణ సారస్వత సామ్రాట్ సహజానందంగారు కృతిపతి ప్రశంసలో అమోఘంగా అరవైఆరు పేజీలు వ్రాశారు.

అందులో కొంత గద్యం. మరికొంతపద్యం.

కామందులవారి మీసాల గురించి ఎక్కువ పద్యాలున్నాయి.

"కోరమీసాలగాంచి గగ్గోలుపెట్టు పరిపరం బుల జనము లబ్బాయటంచు." మీసముల మాట నటుంచి నెత్తురు చిమ్మే కనుగ్రుడ్లు, సిమెంటు పలకల్లాంటి చెంపలు, అదో బ్రహ్మాండాకారం.

పల్లె చుట్టూ ఉన్న పొలాలన్నీ కామందుల వారివే. నాలుగుచెరువుల క్రింద పంటపొలాలే కాక పంభై ఎకరాల మామిడితోట, ఇరువై నాల్గు ఎకరాల కొబ్బరితోట కామందుల వారి పిత్రార్జితమే!

ఊళ్లో వారందరినీ గుప్పెట్లో పెట్టుకొని చల్ల కదలకుండా రాజ్యమేలుతున్నాడు కామందులవారు.

కాలం ఇట్లా గడిచిపోతూ ఉంటే ఉన్నట్టుండి ఊడిపడ్డాడు వేదాంతం ఆ ఊరికి.

కామందుల వారెంత గొప్పవారో వేదాంతంగారు అంత మంచివారు. హోమియో వైద్యంలో వేదాంతంగారు అందెవేసిన చెయ్యి. వచ్చీ రావడంతోనే కామందులవారికి పరిచయమైపోయారు. కామందులవారు ఆరుమాసాలనుండి కడుపునొప్పితో బాధపడుతూ వేదాంతాని కాగోడుమ వినిపించాడు. వేదాంతం ఐదారు తియ్యని మాత్రలతోనే కామందులవారి కడుపునొప్పిని కుదిర్చి వేశాడు.

ఆ రోజునుండీ కామందులవారికి వేదాంతం మాట వేదవాక్కైపోయింది. ఆయ నేదిచెప్పినా అక్షరాలా జరిగి తీరవలసిందే.

వేదాంతం రోజా పత్రిక చదివి కామందులవారికి వినిపించేవాడు—స్థానిక రాజకీయాల నుండి అంతర్జాతీయ రాజకీయాలవరకూ. కామందులవారు బహు శ్రద్ధగా వినేవాడు. మంచికో, చెడ్డకో తెలియదుకాని కామందుల వారికి ఎం. ఎల్. ఏ. కావాలనిపించింది. ఈ విపరీతపు బుద్ధి పుట్టిన ముహూర్తంలోనే వేదాంతానికి చెప్పేశాడు. వేదాంతం అదెంత పనిలే అన్నారు. అందుకు కావలసినవన్నీ చిటికెలమీద ఏర్పాటు చేస్తానన్నాడు.

ముందుగా ఏదైనా పార్టీ టికెట్టు కావాలి గదా ? దాన్ని సంపాదించడానికి కావలసిన హంగులన్నీ ఉండాలి. అందుకోసమని వేదాంతం కామందులవారిని పిలుచుకొని పట్నానికి బయలు దేరాడు.

ఓం ప్రథమంగా ఒక కారు కొన్నారు. కారు లేకున్నా కారున్నవాడే రాజకీయ నాయకుడు గదా ?

ముందుగా ఖాదీషాపులో ప్రవేశించి సరిగంచు ఖాదీ పంచలు కొన్నారు. లెదర్‌బాగ్ ఉండి తీరాలి గదా ? కావలసినవన్నీ సర్దుకొని కాంగ్రెస్ నాయకులను కలుసుకొని ఇష్టాగోష్ఠిగా సంప్రదించారు.

వేదాంతం వెయ్యి ఎత్తులు వేసినా టికెట్టు దొరక లేదు. పూర్వాశ్రమంలో ఏవిధంగా ఉన్నా ఒక్క ఏడాదైనా కాంగ్రెస్‌లో లేనిదే కొత్తవారికి టికెట్టు లేదని తేలిపోయింది.

దేశంలో ఎన్నో పార్టీలు ఉన్నవి గదా ?

కాంగ్రెస్ ఇవ్వకపోతే కమ్యూనిస్టు. అదీ ఇవ్వకపోతే స్వతంత్రపార్టీ. అదీలేకుంటే సోషలిస్టు. అవి ధైర్యాన్ని వదిలిపెట్టకుండా ప్రయత్నంలో పడ్డాడు.

కమ్యూనిస్టులు వీలుకాదన్నారు. స్వతంత్ర పార్టీవాళ్ల షరతులు కామందులవారికి నచ్చినా వేదాంతానికి నచ్చలేదు. సోషలిస్టులు పరిహసించారు.

ఛీ ! ఇవన్నీ ఎందుకు ? ఇండిపెండెంటుగా నిలిస్తే మంచిదనిపించింది వేదాంతానికి. ఈ ఆలోచన స్ఫురించగానే వేదాంతం కామందుల వారిని తీసుకొని కారులో స్వగ్రామానికి చేరుకొన్నాడు.

ఒకా నొక సుప్రసిద్ధ పత్రికా సంపాదకుని పిలిచి వెయ్యిన్నీ నూటపదహార్లు చేతిలో పెట్టి లక్షణంగా భోజనం పెట్టి కామందులవారిని గురించి ఘనంగా నాలుగు వారాలపాటు వ్రాయమన్నాడు.

ఆ సంపాదకోత్తముడు కామందులవారి వంశవృక్షాన్ని తీసుకొని ఆయన ఆకారము, ఆహారము వగైరా వివరాలతో బ్రహ్మాండమైన రిపోర్టును తయారుచేసి చివరి కామందు వారు ఎన్నికల్లో పోటీ చేయనున్న విషయాన్ని గూడా స్పష్టంగా ప్రకటించాడు.

కామందుల వారాదెబ్బతో ఎగిరి గంతేశారు. ఎం. ఎల్. ఏ. కావడానికి ఎంత ధనమైనా సరేనంటూ వేదాంతానికి హామీ ఇచ్చాడు.

ఎన్నికలు ఆరుమాసా లున్నాయన్నప్పటినుండి ప్రచారం ఆరంభమైంది.

వేదాంతంగారి సలహా ప్రకారం ముందుగా ఒక పట్టీ తయారైనది.

ఒక డజన్ లౌడ్ స్పీకర్లు.

ఒక ప్రెస్సు.

ఒక వార పత్రిక.

అరడజను జీపుకార్లు.

ముప్పావు డజను వానులు.

పది బుర్ర కథ దళాలు.

పదేనుమంది బుడ బుడక్కలవాళ్లు.

ఐదుగురు భాగవతులు.

ఇరవైనాలుగు పెట్రొమాక్సులైట్లు.

ముప్పై సైకిళ్లు.

రెండు వందలమంది వాలంటీర్లు.

మొదటి మూడు మాసాలకుగాను ఐదు లక్షల రూపాయలు ప్రత్యేకించ బడినవి. ఈ డబ్బు చాలనిపట్ల మరో లక్ష రూపాయలు కామందులవారి బొక్కసం నుండి ఏక్షణానైనా ఎత్తుకోవచ్చునని వేదాంతంగారికి హామీ ఇవ్వ బడింది.

ఈ ఏర్పాట్లు నన్నిటినీ కరపత్రంలో ప్రచురించి వలంటీర్లకు ఇంటర్వ్యూ ఏర్పాట్లు చేశాడు వేదాంతం. క్వాలిఫికేషన్ అవసరంలేదు. చదువనూ వ్రాయనూ నువారుగా వచ్చి ఉంటే చాలునన్నారు.

గ్రామ సహాయక శిక్షణ శిబిరాలలోగానీ, సేవాదళ శిబిరంలోగానీ, భారతసేవక్ సమాజ్ లోగానీ, లోకసేవా సైనిక శిబిరంలోగానీ వారం రోజులపాటు తర్ఫీదు పొంది ఉంటే చాలు. నెలకు వందరూపాయలిచ్చి రోజుకు మూడు రూపాయలు టి. ఏ. ఇస్తామన్నారు.

రెండువందల మంది కావలసి ఉంటే ఆంధ్ర దేశం నలుమూలలనుండి పన్నెండు వందల దరఖాస్తులు వచ్చి పడ్డాయి. వాటితోపాటు ఎం. ఎల్. ఏ. ల రికమండేషన్లు లెటర్లు బోలె డున్నాయి. వారున్న బిజీలో ఈ ఉత్తరాలు ఎందుకిస్తున్నారో ఎవరికిస్తున్నారో తెలిసే అవకాశం లేదు. అంతా ఖర్మ !

విశ్వ ప్రయత్నంతో ఇంటర్వ్యూ పూర్తి చేయించాడు వేదాంతం. ఉన్నపాటున రెండు వందల మందిని సెలక్టుచేసి పారేశాడు. దేనికైనా మంచిదని వంద మందిని వెయిటింగ్ లిస్టులో వేయించాడు.

వలంటీర్ల సెలక్షను ముగిసిందే ప్రెస్ కొనేశాడు. వార పత్రికకు ఎడిటర్ కావలసి వచ్చింది.

ఎడిటర్ ఎన్నిక కొంత చిక్కుగానే తోచింది. వేదాంతం ఒక్క క్షణం ఆలోచించి తన పేరుతోనే డిక్లరేషన్ చేయించాడు. ఆ పత్రిక పేరే ఇండిపెండెంట్.

వాన్లూ, జీపులూ, సైకిళ్లూ వారం పది రోజులకల్లా బారులు తీరి నిలిచి పోయాయి.

పూర్వకాలంలో తమకు కావ్యాన్ని అంకితం ఇచ్చిన కవిని పిలిపించాలన్నాడు కామందులవారు. వేదాంతం గారందుకు అంగీకరించ లేదు.

ప్రజా కవిత్వం వ్రాసేవారు కావాలన్నాడు.

'ఆకలిమంటలు
మొండి గోడలు
పూరి గుడిసెలు
లోతు డొక్కలు
చిక్కిన కండలు—
రైతూ రైతు
కూలన్నా కూలి—

ఇట్లా పదాలతో పదహారణాల పల్లె పదాలతో పసందైన బుర్రకథలు వ్రాసేవారు కావాలి.

అందులో కామందులవారిని వీరాధివీరుడుగా దానకర్ణుడుగా వర్ణించాలి.

ఇట్లాంటి కథ వ్రాసేవాడికోసం వేదాంతం దివిటీ వేసి గాలించాడు.

అంత కష్టమవసరం లేకనే ఒక విప్లవ కవి దొరికి పోయాడు.

ఆయన ఏమంత ఎక్కువ అడిగేవాడుగా తోచలేదు. నాలుగు పూటలు కారులో త్రిప్పి ఐదు కాఫీలు, ఆరుసిగరెట్లు ఖర్చు కావడం

# కామందుల వారు

తోనే అద్భుత బుర్రకథ తయారైంది గాని వేదాంతంగారు కవి కష్టం తెలిసినవాడు గనుక చిన్న ఎత్తున్న పెద్ద సన్మానం చేయించాడు. పచ్చని శాల్వతో నూటపదహార్లు అందుకొన్నారు కవిగారు.

ఆ సన్మానం రోజుననే బుర్రకథను ప్రదర్శించారు.

'కోరమీసలా కామందోరూ గొప్పోరు బాబూ
ఊరూ పేరూ ఉన్నమనిసిరా
కారులున్నవాడు.
ఒరిగే గరిసెలు విరిగే గాదెలు
వరాలు పెట్టెల్లో
తరగని సంపద ధర్మకార్యముల
దానకర్ణుడయ్యా ! తం.

బుర్రకథ చెబుతున్న కొద్దీ కామందులవారు మీసాలు మెలివేస్తూ వచ్చారు. వేదాంతంగారు ప్రజల మనస్తత్వాలను అత్యంత జాగ్రత్తగా పరిశీలిస్తూ వచ్చారు.

సన్మానమందుకొన్న ప్రజాకవిగారినే నెలకు డెబ్బైరూపాయల జీతంతో ఇండిపెండెంటు పత్రికకు సబ్ ఎడిటర్‌గా నియమించారు.

మందీ మార్బలమంతా సిద్ధంకాగానే ఎన్నికల ప్రచారం హోరెత్తి పోయింది. కామందులవారి ఎన్నికల గుర్తు గుమ్మడికాయ. ఆ గుర్తు గల చీటీలు ఇంటింటికీ పంచుతున్నారు.

వేదాంతంగారి కింతలో మరొక దివ్యమైన ఆలోచన తట్టింది. ఈ ఆలోచన కామందుల వారికి గూడా బాగా నచ్చింది.

గుమ్మడికాయ గుర్తు బాగా ప్రచారంలోనికి రావలెనంటే కొన్నివేల గుమ్మడికాయలు తెప్పించి ఓటరు కొకటి ఇవ్వలేకపోయినా ఇంటి కొకటివ్వటం మంచిదని తోచింది.

వేదాంతంగారు ఎన్నికల పరివారంతో సహా బెంగుళూరికి వెళ్లారు. మార్కెట్టులోని గుమ్మడికాయలు చాలవని మరో పదిరోజుల వరకూ దిగే సరుకువంతా తమ ఊరికి రవాణా చేసేటట్లు ఒప్పందం చేసుకున్నారు.

వేదాంతంగారు గుమ్మడి కాయలను నియోజక వర్గమంతా ప్రతి ఇంటికీ పూర్తిగా అందే ఏర్పాట్లను స్వయంగా చేశారు.

ఇండిపెండెంట్ పత్రికలో కామందులవారి పేరు గుమ్మడికాయలంత అక్షరాలతో వెయ్యాలనే ఆలోచనకూడా స్ఫురించింది. ఎడిటర్ గారు టెక్నికల్ అభ్యంతరమ్ము తెచ్చారు. పేజీకి ఒక అక్షరం చొప్పునైతే వీలవుతుందన్నాడు వేదాంతం. కామందులవారి పేరు ప్రతి అక్షరాన్ని గుమ్మిడికాయ రూపంలో వ్రాయించి బ్లాకులు చేయించి ఆవిధంగా పేజీకొక అక్షరం చొప్పున వేయించి తీరాలనే తీర్మానాన్ని ఎన్నికల కమిటీ ఆమోదించడంతో విప్లవకవిగారు ఉసూరుమంటూ పట్నానికి పరుగెత్తారు.

ఒక్క నెలమాత్రమే ఉంది. ఎన్నికలలో అన్ని పార్టీలు పాల్గొంటూ ఉన్నవి.

ఒంటె బొమ్మ, లాంతరుబొమ్మ, సైకిలు బొమ్మవాళ్లు కూడా ఉన్నారు.

అన్ని బొమ్మలకంటే గుమ్మడికాయల బొమ్మలే ఎక్కువ.

వేదాంతంగారు తమ నియోజకవర్గంలోని కుమ్మరివాళ్లనంతా పిలిచి మట్టితో గుమ్మడి కాయల్ని చెయ్యమన్నాడు.

మేదరవాళ్లనంతా పిలిచి గుమ్మడికాయల మోస్తరు బుట్టలల్లమన్నారు.

మొదట కేటాయించిన డబ్బు అయిపోయి మరో నాలుగు లక్షలు దాటిపోయింది.

కామందులవారి చెయ్యి సర్వకాల సర్వావస్థలలోనూ ఆయన మీసాలమీదే ఉండి పోతూ వచ్చింది.

ఒక్కొక్క పోలింగు బూతులోనూ ఒక్కొక్క భోజన కేంద్రం ఏర్పాటయింది. రోజుకు



నన్‌జన్‌గూడు ఔషధములకు ఒక టవునుకు ఒక స్టాకిస్టును ఆహ్వానించెదము

మలబద్ధము - మూలవ్యాధి

నిత్య మలబద్ధము మూలవ్యాధిని లేక రక్తమూలమును కలుగజేయును. దీనివలన మూలములోపల, దాని చుట్టూ ఉండే శిరలు వాచిపోవును. నొప్పిగా ఉండుటచే మల విసర్జనము, ఎక్కువ ప్రయాసము కష్టముతో కూడియుండును. మలబద్ధము మరింత ఎక్కువౌతుంది. దాంతోపాటు మూలవ్యాధి ముదిరి భరింపరాని నొప్పితో పగుళ్ళు ఏర్పడతాయి. కాబట్టి మూలవ్యాధి వల్ల కల్గే తీవ్రమైన బాధ, కష్టము నివర్తి అయితే మలవిసర్జనం సూనాయాసం ఔతుంది. హెడంజా చేసే పనే ఇది. ఇది వెంటనే నొప్పిని, దురదను నివారించును. విడవకుండా వాడితే మూలము పూర్తిగా ముడుచుకొనిపోయి శంకకుదిరి పోవును. ప్రసిద్ధి చెందిన జర్మన్ తయారీ మూల వ్యాధి నివారిణి. హెడంజాలో తిమ్మి రేక్కు నట్లు చేయుగల మందులేవి లేవు. మరియు వస్త్రములను ఖరాబు చేయదు. ఉపయోగము అతి సులభము. ప్రతి ప్యాకెట్‌లోను ఉపయోగ విధానపు సూచనలు ఒకప్లాస్టిక్ గొట్టంతోసహా సప్లయి చేయబడును. మీ మూలవ్యాధి సమస్యకు ఉత్తరము హెడంజా నేడే హెడంజాను వాడండి. ఇప్పుడు హెడంజా ఇండియాలో తయారవుతుంది.

DZ 952-A

ప్రతి కేంద్రంలోనూ వెయ్యి విస్తళ్ళ ఖర్చవుతూంటే ఎన్నికలు ఎప్పుడూ ఉంటే ఎంత బావుండే దనిపించింది భోజనప్రియులకు.

పేజీకొక అక్షరంతో ఇండిపెండెంట్ పత్రిక వారానికి రెండిష్యూలుగా వెలువడుతున్నది.

ప్రతివీధిలోనూ గుమ్మడికాయ అకారంతో వెదురుబుట్టలు వ్రేల్లాడుతున్నాయి.

కామందులవారు గుమ్మడికాయంత బొజ్జను కదిలిస్తూ పెద్ద గుమ్మడికాయలను ఎత్తించుకొని ఇంటింటికీ వెళ్లి గుమ్మడికాయ గుర్తుకే ఓటు వేయమని తీవ్రమైన ప్రచారాన్ని ఆరంభించారు.

బెంగుళూరునుండి ఎన్నికల తేదీవరకు గుమ్మడికాయల రవాణా ఆగరాదనే నిర్ణయం ఆలస్యంగానైతేనేమి చేశారు.

బుర్రకథలు

హరికథలు

బుడబుడక్కల కథలు

ఉపన్యాసాలు

ఒకటేమిటి నియోజక వర్గమంతా గగ్గోలెత్తిపోయింది.

ప్రతి ఊళ్లో, ప్రతిరాత్రీ ఏదో ఒక వినోదం—

నిరంతరంగా సాగింది.

కామందులవారు పొలాన్ని, ఇంటిని కూడా తాకట్టుపెట్టి మరో ఐదు లక్షలు తెచ్చారు.

ఎగిరి పోతున్నాయి పచ్చనోటు —

వెయిటింగు లిస్టులో ఉన్న వందమందికి గూడా అపాయింట్‌మెంట్సు ఐపోయాయి.

రానే వచ్చింది ఎన్నికల దినం.

కామందులవారు గెలుస్తారనే జనవాక్యం కనుక ఎదుటి వాళ్లెవరూ ఏజెంట్లను గూడా ఉంచలేదు. దాదాపు చాలుకొన్నారు.

అన్ని గ్రామాలవారూ అమితోత్సాహంతో పాల్గొన్నారు. మాటికి తొంభై ఓట్లు పోలైనాయనీ కామందులవారికి మాటికి ఎనభై ఓట్లు వచ్చి ఉంటాయనీ, అంచనా వేశాడు వేదాంతం !

ఫలితాలు వారం రోజులకంతా ప్రకటిస్తామన్నారు. కామందులవారిని ఊరేగించడానికి బ్రహ్మాండమైన ఏర్పాట్లు చేశారు.

నలభై డూంలైట్లు, మయూర వాహనంపై కామందులవారి ఊరేగింపు. బాణసంచా. నల్లమందు శివలు— నిలువెత్తు హారాలు ఊరి కొకటి—

వేదాంతంగారు అన్ని ఏర్పాటులను పూర్తిచేసుకొని విజయవార్త కోసం ఎదురు చూస్తున్నారు. అదెటూ రానే వస్తుంది గనుక ముందుగానే ఊరేగింపు లేవదీయమన్నారు పెద్దలు.

దూరంలో కన్పించింది కారు.

ఆరంభమైంది ఊరేగింపు.

గబగబా సాగి పోతూంది—

శివలు, తుతార్లు, తప్పెట్లు, పలకలు,



కలిమిలేములు ఫోటో—పి. కృష్ణకుమార్ (మద్రాసు–17)

మేళాలు, తాళాలు, కొమ్ములు, గిగిరెట్లు— ఒకటే మోత—

వంద గజాలు ఊరేగింపు సాగిన వెనుక ఉన్నట్టుండి ఆగి పోయింది.

గుసగుసలు పోతున్నారు. ఒక్కరూ గట్టిగా చెప్పరు.

చెవులు కొరుక్కొంటున్నారు.

మయూరవాహనం మీది కామందులవారు కళ్లు తేలవేశారు.

వెనక్కు సోలిపోయారు.

స్పృహ తప్పింది. ప్రమాదమేమీ జరుగలేదు గాని ఆయనకు నిజం చెప్పేశారు.

ఓడిపోయాడట పాపం !

ఓడిపోతే పోయాడు గానీ డిపాజిట్టు కూడా దక్కలేదంటే ఎలా నమ్మడం ?

★